యూనిట్ I

# 3. శివతాండవం

– పుట్టపర్తి నారాయణాచార్యులు

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

నా గానపు స్వరలయలకు
శివుడు తాండవించాడట
నా గానపు గతికి జతికి
గణపతి నర్తించాడట
నా గానపు మధురిమలకు
కృష్ణమురళి మోగిందట
నా గానపు రసఝరిలో
ప్రకృతి నాట్య మాడిందట

ప్రశ్నలు :

1. ఈ పంక్తులు దేని గురించి చెబుతున్నాయి?
2. ఈ పంక్తులలోని ముఖ్యమైన పదాలేవి?
3. ఈ పంక్తులు వింటున్నప్పుడు లేదా చదువుతున్నప్పుడు మీరు పొందిన అనుభూతి ఏమిటి?
4. ఇలాంటి గేయం / పాట మీకు తెలుసా?

© SCERT not to be republished

### ఉద్దేశం

శివుడి నాట్యంలో కవి సత్వరజస్తమో గుణాలను దర్శించాడు. ఆ త్రిగుణాత్మకమైన తాండవంలోని వర్ణనను, అద్భుతమైన లయాత్మకతను పరిచయం చేయడం ద్వారా పిల్లల్లో సృజనాత్మకతను, భాషాభిరుచిని, ప్రకృతిఆరాధనను పెంపొందింప చేయడం ఈ పాఠం ఉద్దేశం.

ఈ పాఠ్యభాగం 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన 'శివతాండవం' అనే గ్రంథం లోనిది.

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. తెలియని పదాలకు అర్థాలను తెలుసుకోండి.
2. చిత్రాలను చూసి, సందర్భాన్ని అనుసరించి, ఆలోచించి భావాన్ని గ్రహించండి.
3. పాఠంలో తెలియని విషయాలు గాని, తెలుసుకోవలసిన అంశాలు గాని మీ ఉపాధ్యాయుడితో చర్చించండి, తెలుసుకోండి.

ఆడెనమ్మా ! శివుడు
పాడెనమ్మా ! భవుడు

తరితీపు వెన్నెలలు విరిసికొన్న విధాన
నెరజాజులవి కుప్ప నెరసికొన్న విధాన
తెలిబూది పూత బెట్టులు గట్టిన విధాన
చలికొండ మంచు కుప్పలు గూర్చిన విధాన
పొసగ ముత్తెపు సరుల్పోహళించు విధాన
అసదృశము నమృతంబు నామతించు విధాన
**ఘన సారము**ను దెచ్చి కలయజల్లు విధాన
మనసులో సంతసము గనుల జారు విధాన
కులుకు నీలపుగండ్ల దళుకు జూపులు బూయ
ఘలు ఘల్లుమని కాళ్ళ జిలిపి గజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా ! శివుడు !
పాడెనమ్మా! భవుడు



మబ్బుగము లుబ్బికొని ప్రబ్బికొన్న విధాన
అబ్బురపు నీలములు లిబ్బిసేరు విధాన
నల్లకలువలు దిక్కులెల్ల విచ్చు విధాన
మొల్లముగ దుమ్మెదలు మొనసికొన్న విధాన
నగలు కాటుకకొండ పగిలి చెదరు విధాన
తగిలి చీకటులు గొప్పగ గప్పెడు విధాన
తనలోని తామసము కనుల జారు విధాన
తనలోని వక్రతయె కనుల దీరు విధాన
కులుకు నీలపు గండ్ల దళుకు జూపులు బూయ
ఘలు ఘల్లుమని కాళ్ళ జిలిపి గజ్జెలు మ్రోయ
ఆడెనమ్మా ! శివుడు !
పాడెనమ్మా! భవుడు

తమ్ములై, ఘటిత మోదమ్ములై, సుకృత రూ
పమ్ములై, శాస్త్ర భాగ్యమ్ములై, నవకోర
కమ్ములై, వికచ పుష్పమ్ములై, తుమ్మెదల
తమ్ములై, భావ మంద్రమ్ములై, హావపు

**ఘనసారము**
పచ్చకర్పూరం.
పరిమళ ద్రవ్యాల్లో
ఒకటి
ఇది
చల్లదన్నాన్నిస్తుంది.

© SCERT not to be republished

ల్లమ్ములై, నూత్నహారమ్ములై, వల్గు
హాసమ్ములై, కన్గొనల సొమ్ములై, విశ్రాంతి
దమ్ములై, రక్త కిసలమ్ములై, రక్తి చి
హ్నమ్ములై, తంద్ర గమనమ్ములై, గెడగూడి
కులుకు నీలపు గండ్ల తళుకు జూపులు బూయ
ఘలు ఘల్లుమని కాళ్ళ జిలిపి గజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా ! శివుడు !
పాడెనమ్మా! భవుడు

**కస్తురి**
మృగం నాభి నుండి తీసిన పరిమళ ద్రవ్యం. ఇది చల్లదనాన్నిస్తుంది.

తరగలను జిరుగాలి పొరలు లేచిన యట్లు
చిరుగాలిలో దమ్మి విరులు గదలిన యట్లు
విరులలో నును తావి తెరలు లేచినయట్లు
తెరలపై చిత్రాలు పరిఢవించిన యట్లు
కమ్మ **కస్తురి** వీణె గడగి విరసిన యట్లు
నెమ్మి దన పింఛమ్ము నెమ్మి విప్పిన యట్లు
చిగురుటాకులు గాలి వగలు వోయిన యట్లు
నగవులో లేవలపు బిగువు జారినయట్లు
కులుకు నీలపు గండ్ల దళుకు జూపులు బూయ
ఘలు ఘల్లుమని కాళ్ళ జిలిపి గజ్జెలు మ్రోయ

ఆడెనమ్మా ! శివుడు !
పాడెనమ్మా! భవుడు



© SCERT not to be republished

**కవి పరిచయం**



పుట్టపర్తి నారాయణాచార్యులు (1914-1990) స్వస్థలం అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామం. 14 భాషల్లో ప్రావీణ్యులు. 8 భాషల్లో కవిత్వం చెప్పగల దిట్ట. సంగీత, నాట్య శాస్త్రాల్లో సంపూర్ణ పాండిత్యం కలవారు. "సరస్వతీ పుత్ర" వీరి బిరుదు. శివతాండవం, మేఘదూతం, షాజీ, కావ్యమాల, జనప్రియ రామాయణం, పండరీ భాగవతం, సాక్షాత్కారం మొదలైన రచనలు చేశారు. 'లీవ్స్ ఇన్ ది వింద్' అనే ఆంగ్ల కావ్యం కూడా వీరి రచనే! వీరు రాసిన శివతాండవం సంగీత సాహిత్య నాట్య సంకేతాల సమ్మేళనం. పుట్టపర్తి రచనల్లో దేశభక్తి, సాంస్కృతికవిలువలు, జాతీయభావాలు, మానవీయవిలువలు తొణికిసలాడతాయి.

**ప్రక్రియ - గేయ కవిత**

గేయ కవిత పాడుకోవడానికి అనువైనది. మాత్రా ఛందస్సును అనుసరించి నడుస్తుంది. లయాత్మకంగా సాగుతుంది.

## సారాంశం :

నిర్మలమైన వెన్నెల కురుస్తున్నట్లుగా, అందమైన పూలు కుప్పపోసినట్లుగా మృదువైన ముత్యాలహారాన్ని కూర్చినట్లుగా, అనన్య సామాన్యమైన అమృతాన్ని పంచినట్లుగా, పచ్చకర్పూరాన్ని అన్ని వైపులా చల్లినట్లుగా, మనసులోని ఆనందం కన్నులలోంచి జారుతున్నట్లుగా, చురుకైన నీలపుకళ్ళలో కాంతులు విరబూయగా, ఘల్లు ఘల్లుమని చిలిపి గజ్జెలు మోగుతూండగా శివుడు ఆడుతున్నాడు. శివుడు పాడుతున్నాడు. దీనిలో ఉపమానాలన్నీ ధవళత్వాన్ని ప్రతిబింబిస్తాయి. సంకేతం తెలుపు. స్వచ్ఛతకు, పవిత్రతకు నిదర్శమని అంతరార్థం. శివునితాండవం వల్ల ఆనందం పరివ్యాప్తమయిందని కవి భావన.

మేఘాలన్నీ ఒక్కసారిగా అలుముకున్నట్లుగా, అద్భుతమైన నీలమణులు ఒక్కచోట పేర్చినట్లుగా, నల్లకలువలు దిక్కులంతటా విచ్చుకొన్నట్లుగా, తుమ్మెదలు ముసురుకొని శోభిస్తున్నట్లుగా, నల్లని కొండలు పగిలి ముక్కలయినట్లుగా, ఒక్కసారి చీకట్లు వ్యాపించినట్లుగా, తనలోని అజ్ఞానం కళ్ళలోంచి జారుతున్నట్లుగా, వక్రతలు కళ్ళలో కన్పిస్తున్నట్లుగా, చురుకు నీలపు కళ్ళలో కాంతులు విరబూయగా పాదాలకున్న చిలిపి గజ్జెలు ఘల్లుఘల్లుమని మోగుతూండగా శివుడు ఆడుతున్నాడు, పాడుతున్నాడు. దీనిలో అంశాలన్నీ నీలవర్ణ వర్ణితాలు. సృష్టిలో నలుపు కూడా అద్భుతమైనదనీ వర్ణించారు.

ఆయన నాట్యం తామర పూలలా విప్పారి గొప్ప ఆనందాన్నిచ్చింది. శుభప్రద రూపంతో, శాస్త్రీయ సంపదతో నిండి ఉంది. తాజా పూమొగ్గల్లా, వికసించిన పువ్వుల్లా ఆయన నాట్యం ఉధృతమౌతోంది. తుమ్మెదలు మూసిన తామరలా, కొత్త రత్నాల్లాగా, చక్కని నవ్వుల్లో, కనుకొలకుల సోకులతో ఎర్రని చిగురులా సాక్షాత్కరిస్తుంది. ఆనందానికి సంకేతమై, తూగు నడకలతో చురుకైన నీలపు కళ్ళు కాంతులు విరబూయగా ఘల్లు ఘల్లుమని పాదాలకున్న చిలిపి గజ్జెలు మోగుతూండగా శివుడు ఆడుతున్నాడు, పాడుతున్నాడు. దీనిలో వర్ణితాంశాలన్నీ అరుణవర్ణ ప్రపూర్ణం. తాండవం రానురాను ఉధృతి చెందుతుందని, అది ఆనందాన్నిస్తుందని వర్ణించడం దీనిలో ప్రత్యేకత.

అలలు కదిలినట్లు, చిరుగాలికి ఆకులు కదలినట్లుగా, తామరపూలు కదిలినట్లు, పూలలోని సువాసనలు గాలిలో వ్యాపించినట్లు, తెరపై బొమ్మలు నటనను ప్రదర్శించినట్లు, శ్రావ్యమైన పరిమళ వీణలు మోగినట్లు, నెమలి తన అందమైన పింఛాన్ని విప్పినట్లు, గాలికి చిగురాకులు ఒయ్యారాలు పోయినట్లుగా, లేతనవ్వులొలికినట్లుగా, చురుకైన నీలపు కళ్ళు కాంతులు విరబూయగా, ఘల్లు ఘల్లుమని పాదాలకున్న చిలిపిగజ్జెలు మోగుతూండగా శివుడు ఆడుతున్నాడు. శివుడు పాడుతున్నాడు.

శివతాండవంలో అలలు కదలడం అనేది గంభీరతకు ప్రతీక. పరిమళాలు వ్యాపించడం, నెమలి నాట్యమాడడం, చిగురాకుల ఒయ్యారాలు సౌకుమార్యానికి ప్రతిబింబాలు. ఆయన తాండవంలో గంభీరం, సౌకుమార్యం కలగలిసి అద్భుత అందాన్ని ఆవిష్కరించడం ఇక్కడ విశేషం. స్థూలంగా శివతాండవంలో ప్రకృతి ప్రతిబింబించింది. ప్రకృతి వర్ణన పదాల కూర్పు అలంకారాలతో కూడి మరింత సౌందర్యాన్ని కలిగించింది.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

**అ) కింది అంశాల గురించి మాట్లాడండి.**

1. మీకు తెలిసిన నాట్యరీతుల గురించి చెప్పండి.
2. 'శివతాండవం' గేయాన్ని లయబద్ధంగా పాడండి. ఇది వింటున్నప్పుడు మీకు ఎలా అనిపించిందో చెప్పండి.
3. పుట్టపర్తి నారాయణాచార్యులు శివతాండవాన్ని 'నల్లకలువలు విచ్చుకొన్నట్లు, నల్లనికొండలు పగిలినట్లు, చీకట్లు వ్యాపించినట్లు, - ఇలా ఎన్నో అంశాలతో పోల్చారు కదా! ఇలాంటి పోలికల ద్వారా మీరేం గ్రహించారు?

**ఆ) 'గేయంలో' అంత్యప్రాస పదాలు ఏమున్నాయి - పాఠ్యభాగంలో గుర్తించి కింద గీతగీయండి ?**

**ఇ) కింది గద్యం చదివి ప్రశ్నలకు జవాబులివ్వండి.**

మహాశివుడు ఆనందంతో నాట్యం చేస్తూ తన చేతిలోని డమరుకాన్ని 14 మార్లు మోగించాడు. ఆ ధ్వని విశ్వవ్యాప్తమైంది. పాణిని అలా వెలువడ్డ శబ్దాలను స్వీకరించి సంస్కృత భాషలో సూత్రమయమైన వ్యాకరణాన్ని రచించాడు. 'అ ఇ ఉణ్, ఋ ఌక్....... అంటూ 14 మాహేశ్వర సూత్రాలతో తన వ్యాకరణ రచన ఆరంభించాడు. ప్రపంచ వాఙ్మయంలో పాణిని సంస్కృతవ్యాకరణం సర్వోత్తమమైనది.

1. శివుడు డమరుకం ఎందుకు మోగించాడు ?
2. పాణిని వ్యాకరణం గొప్పతనం ఏమిటి ?
3. పై సన్నివేశం దేనికి ప్రారంభంగా చెప్పవచ్చు ?

**ఈ) కింది ప్రశ్నలకు పాఠ్యాంశం నుండి సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.**

1. పాఠంలో గేయంలోని మొదటి చరణం చదవండి. శివతాండవాన్ని కవి ఎలా వర్ణించాడో రాయండి.
2. 'తమ్ములై' - అంటూ సాగిన గేయంలో శివుని నాట్యాన్ని కవి కొన్ని పూలతో పోల్చాడు. వాటిని తెలపండి.
3. తెల్లదనాన్ని తెలిపే కొన్ని అంశాలతో శివతాండవాన్ని పోల్చారు. ఉదాహరణకు 'వెన్నెల కురుస్తున్నట్టు' మొదలైనవి. ఇలాంటి అంశాలను కొన్నింటిని రాయండి.
4. శివుని నాట్యాన్ని వర్ణించే కొన్ని పంక్తులను రాసి, వాటిని వివరించండి.

©SCERT not to be republished

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1. వసంతశోభ ఎలా కమ్ముకుందో సొంతమాటల్లో రాయండి.
2. ఈ పాఠ్యభాగంలోని కవివర్ణనల్లో మీకు బాగా నచ్చిన అంశమేది? అది ఎందుకు నచ్చింది? వివరించండి.
3. 'శివుని తాండవం కర్పూరం చల్లినట్లుంద'ని కవి భావించాడు. దాని ఆంతర్యాన్ని మీరు ఏమని భావిస్తున్నారు?

**ఆ) కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.**

1. శివతాండవం గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.
2. శివుడు నర్తించిన విధానంలో ప్రత్యేకతలు ఏమున్నాయి ?
3. పాఠం ఆధారంగా కవి శివుని నాట్యాన్ని ఏయే ప్రకృతి అంశాలతో పోల్చాడో వివరంగా రాయండి.

**ఇ) సృజనాత్మకంగా రాయండి.**

1. ఈ గేయంలో 'పొరలు లేచినయట్లు', 'విరులు కదలినయట్లు' మొదలైన అంత్యప్రాసలున్నాయి కదా! ఇవిచదువుతుంటే లయాత్మకంగా ఉండడం వల్ల ఆనందం కలుగుతుంది. ఇలాంటి వాటిని కొన్నింటిని గ్రహించి వాటితో చిన్నకవిత గాని, గేయంగాని రాయండి.

**ఈ) ప్రశంసాత్మకంగా రాయండి.**

పుట్టపర్తి నారాయణాచార్యులు గారు అంత్యప్రాసలతో శివతాండవాన్ని దాని సౌందర్యాన్ని వర్ణిస్తూ రాసిన విధానాన్ని చూశారు కదా! దీనివల్ల మీరు పొందిన అనుభూతిని మీ 'డైరీ'లో రాయండి. ఉపాధ్యాయులకు చూపండి.

## III. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలకు సమానార్థక పదాలను పాఠంనుండి గ్రహించి రాయండి. వాటితో వాక్యాలు రాయండి.**

1. తామరలై
2. సంతోషాలై
3. మొగ్గలై
4. హొయలనడకలై

**ఆ) కింది వాక్యాల్లో ఒకే అర్థానిచ్చే పదాల్ని గుర్తించి, వేరు చేసి రాయండి.**

1. వెన్నెల విరగకాస్తే హాయి కలుగుతుంది. ఆ కౌముది చల్లదనాన్నిస్తుంది. మన కవులు అనేకులు తమ కావ్యాల్లో చంద్రికల్ని వర్ణించారు.
2. సూర్యుడు అస్తమించగానే అంధకారం అలముకుంది. ఆ తమస్సు భయం కలిగిస్తుంది. అందుకే చీకట్లో ప్రయాణం మంచిది కాదంటారు పెద్దలు.
3. ఆహా! ఏమి తావి! బహుశా ఈ పరిమళం గులాబీతోట నుండి కాబోలు ! భగవంతుడు పుష్పాలకు మంచి సౌరభాన్ని కూడా అందించి గొప్పపనే చేశాడు.

© SCERT not to be republished

**ఇ) కింది పదాలకు పాఠం ఆధారంగా వికృతి పదాల్ని గుర్తించి రాయండి.**

ఆశ్చర్యం, నెమలి, సంతోషం

**ఈ) కింది పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలను రాయండి.**

1. చలికొండ 2. పుష్పం 3. మోదం 4. కిసలయం 5. తరగలు

## వ్యాకరణం

**అ) కింది సంధులకు సంబంధించిన ఉదాహరణలను పాఠంలో వెతికి రాయండి. విడదీసి, సంధి సూత్రం రాయండి.**

1. ఉత్వసంధి, 2. సరళాదేశసంధి 3. యడాగమసంధి 4. గసడదవాదేశసంధి.

**ఇ) టుగాగమ సంధి :**

కింది పదాలను పరిశీలించండి.

నిలువు + అద్దం = నిలువుటద్దం

తేనె + ఈగ = తేనెటీగ

పల్లె + ఊరు = పల్లెటూరు

వీటిలో సంధి జరిగినపుడు 'ట్' అదనంగా వచ్చి చేరుతుంది. ఇలా 'ట్' వర్ణం వచ్చే సంధిని 'టుగామసంధి' అంటారు.

అట్లే కింది పదాలను కూడా పరిశీలించండి.

చిగురు + ఆకు = చిగురుటాకు / చిగురాకు

పొదరు + ఇల్లు = పొదరుటిల్లు / పొదరిల్లు

వీటిలో 'ట్' అనే వర్ణం సంధి జరిగినపుడు రావచ్చు, రాకపోవచ్చు. 'ట్' వస్తే టుగాగమం అవుతుంది. 'ట్' రాకుంటే ఉత్వసంధి అవుతుంది.

కింది పదాలను విడదీసి రాయండి.

1. పడకటిల్లు 2. కరకుటమ్ము 3. నిక్కంపుటుత్తర్వు 4. నిగ్గుటద్దం.

**ఈ) లు,ల,న,ల సంధి**

| | |
|---|---|
| పుస్తకములు -పుస్తకాలు | గ్రంథములు - గ్రంథాలు |
| దేశముల- దేశాల | రాష్ట్రముల - రాష్ట్రాల |
| జీవితమున-జీవితాన | వృక్షమున - వృక్షాన |

పై పదాలలో మార్పును గమనించారా?

© SCERT not to be republished

పుస్తకములు, గ్రంథములు, దేశముల, రాష్ట్రముల, జీవితమున, వృక్షమున వీటినే మనం పుస్తకాలు, గ్రంథాలు, దేశాల, రాష్ట్రాల, జీవితాన, వృక్షాన అని కూడా అంటాం.

లు,ల,న, అనే అక్షరాల ముందున్న 'ము' పోయింది. 'ము' కంటే ముందున్న అక్షరానికి దీర్ఘం వచ్చింది కదా! దీనినే సూత్ర రూపంలో

**సూత్రం :** "లు,ల,న,లు పరమైనపుడు ఒక్కొక్కపుడు ము వర్ణానికి లోపమూ, దాని పూర్వ స్వరానికి దీర్ఘమూ వస్తాయి".

లు,ల,న,ల సంధికి సంబంధించిన మరిన్ని ఉదాహరణలు రాయండి.

**ఉ) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసానికి సంబంధించిన ఉదాహరణలు ప్రస్తుత పాఠంలో వెతికి రాయండి.**

ఉదా – చిలిపి గజ్జెలు – చిలిపి (విశేషణం) గజ్జెలు (నామవాచకం) – చిలిపివైన గజ్జెలు

**ఊ) సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం**

'తమ్మి విరులు' అనే సమాసంలో మొదటి పదమైన 'తమ్మి' ఏరకం విరులో (తామరపూలు) తెలియ జేస్తుంది. ఇలా పూర్వపదం నదులూ, వృక్షాలూ, ప్రాంతాలూ మొదలైనవాటి పేర్లను సూచిస్తే దాన్ని 'సంభావనాపూర్వపద కర్మధారయ సమాసం' అంటారు.

**ఉదా** 1. మర్రిచెట్టు – మర్రి అను పేరుగల చెట్టు

2. గంగానది – గంగా అనే పేరు గల నది

3. భారతదేశం – భారత అనే పేరు గల దేశం

సంభావనా పూర్వపదకర్మధారయ సమాసానికి మరికొన్ని ఉదాహరణలు రాయండి.

© SCERT not to be republished



**ప్రాజెక్టు పని**

మీగ్రామంలో / పట్టణంలో రకరకాల కళాకారులుంటారు. ఒగ్గుకథ చెప్పేవాళ్ళు, బుర్రకథలు చెప్పేవాళ్ళు, చిందు భాగవతులు, హరికథలు చెప్పేవారు .... ఇలాంటివారి వివరాలు సేకరించండి, వారి ప్రదర్శనల గురించి వివరాలు అడిగి తెలుసుకొని రాయండి.

**సౌందర్యం, సత్యం – వీటి రసవత్సమ్మేళనమే కళ**
**– ఠాగూర్**